సొంతింటి కల సాకారమయ్యేనా..

- ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభంతో పేదల్లో చిగురిస్తున్న ఆశలు
- నియోజకవర్గానికి 3500 ఇళ్లు ప్రకటించడంతో సొంతింటి కోసం ఆశావహుల ఎదురుచూపు

తిరుమలగిరి : కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడంతో నియోజకవర్గంలోని పేద ప్రజల్లో సొంతింటి ఆశ చిగురిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయం చేయనుంది. అలాగే సొంత జాగలేని వారికి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందించనుంది. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పేదలు తమ సొంతింటి కల నెరవేరనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌ హయాంలో..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి 2006లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని అమలు పరిచి నిరుపేదలకు పక్కా ఇళ్లను నిర్మించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 50వేలకు పైగా ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలను పూర్తి చేశారు. దీంతో ఆనాడు పేదల సొంతింటి కల నెరవేరింది.

నత్తనడకన డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల పథకం..

తెలంగాణలో 2014లో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల స్థానంలో 2015లో డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5.40 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. కానీ నియోజకవర్గంలో డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగింది. కొన్నిచోట్ల మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయిన గ్రామాల్లో కూడా లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ జరగలేదు. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు ఇళ్లు లేని నిరుపేదలు సొంత జాగ కలిగి ఉంటే రూ.3 లక్షల వరకు సహాయం అందిస్తామని గృహలక్ష్మి పథకం తీసుకొచ్చింది. అంతేకాకుండా దరఖాస్తులను కూడా స్వీకరించింది. నియోజకవర్గంలో ఇళ్లు లేని నిరుపేదలు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తులపై అధికారులు విచారణ చేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు సైతం అందజేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. నూతన కాంగ్రెస్‌ ప్రభుత్వమైనా తమ సొంతింటి కల నెరవేర్చాలని ఆయా గ్రామాల్లోని ఇళ్లు లేని నిరుపేదలు కోరుతున్నారు.



అనంతారంలో నిలిచిపోయిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు

అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తాం



ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11న సీఎం రేవంత్‌ రెడ్డి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి మొదటి విడతగా 3500 ఇళ్లు వస్తాయి. ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లను ఇస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుంది.

– మందుల సామేల్‌, ఎమ్మెల్యే, తుంగతుర్తి

దరఖాస్తు చేసుకున్నాం



ప్రభుత్వం జనవరిలో చేపట్టిన ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇంటి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నా. నాకు సొంత జాగ ఉంది. ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థికసాయం చేస్తే ఇల్లు నిర్మించుకుంటా. ఈ పథకం నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుంది.

– సలీమ్‌, తిరుమలగిరి

క్లుప్తంగా

పంటలకు నీరందడం లేదని రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

ఆత్మకూర్‌ (ఎస్‌) : పంట చేతికొచ్చే సమయానికి నీళ్లు అందడం లేదంటూ పెన్‌పహాడ్‌ మండలం ధర్మాపురం, భక్తాళాపురం, రంగయ్యగూడెం, తుల్జారావు పేట గ్రామాల రైతులు శుక్రవారం కోటినాయక్‌తండా వద్ద ఎస్సారెస్పీ ప్రధాన కాలువ బ్రిడ్జిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చివ్వెంల, పెన్‌పహాడ్‌ మండలాలకు నీళ్లు ఇవ్వడంలో అధికారులు రైతులకు సరైన న్యాయం చేయడం లేదని ఆరోపించారు. రాస్తారోకో విషయాన్ని తెలుసుకున్న ఎస్‌ఐ సైదులుగౌడ్‌ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. ఈ ధర్నాలో రైతులు తోగరు లింగయ్య, సాదే సీతయ్య, కర్ణాకర్‌, శంకర్‌, భాస్కరాచారి, వెంకటేశ్వర్లు, అజయ్‌, శ్రీను, సుమారు 50మంది రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలు మరువలేనివి



వెంకన్న కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సూర్యాపేటటౌన్‌ : టీఎస్‌ యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి మైలారపు వెంకన్న సేవలు మరువలేనివని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి మైలారపు వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా శుక్రవారం టీఎస్‌ యూటీఎఫ్‌ జిల్లాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌ యూటీఎఫ్‌ కుటుంబ సంక్షేమ నిధి తరఫున రూ.6 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌. సోమయ్య, టీఎస్‌ యూటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు కే.జంగయ్య, రాష్ట్రప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్‌.రాములు, ఎం.రాజశేఖర్‌ రెడ్డి, జి.నాగమణి, వై.సైదులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో 'పోషణ్‌ పక్వాడ్‌'

నాగారం : అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందించే పోషక పదార్థాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ అనురాధ అన్నారు. శుక్రవారం పస్తాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ్‌ పక్వాడ్‌ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రవణ్‌కుమార్‌, ఏఎన్‌ఎం లక్ష్మీబాయి, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, సుశీల, రమాదేవి, కవిత పాల్గొన్నారు.

అర్వపల్లి : పర్సాయపల్లి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆరవ పోషణ పక్షోత్సవం నిర్వహించారు. సీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు జరిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలోఅంగన్‌వాడీ టీచర్లు కొప్పుల ప్రభావతి, సవిత, పీఎస్‌ హెచ్‌ఎం శ్రీనివాస్‌, సురేందర్‌, ఏఎన్‌ఎం పార్వతి, ఆశ కార్యకర్తలు రాంబాయి, జానకమ్మ పాల్గొన్నారు.

పోస్టర్‌ ఆవిష్కరణ

ఆత్మకూరు (ఎస్‌) : దేశ స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన భగత్‌ సింగ్‌, రాజ్‌ గురు, సుఖ దేవ్‌ల 93వ వర్ధంతి కార్యక్రమాలను ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పీవైఎల్‌ జిల్లా కోశాధికారి బండి రవి తెలిపారు. శుక్రవారం ఏపూరులో వర్ధంతి కార్యక్రమాల పోస్టర్లను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహనీయులను స్మరించుకోవడం వారికి దేశ పౌరులుగా మనమిచ్చే గౌరవం అన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు సానబోయిన వెంకన్న, కుంట రవి, దడిగల లింగయ్య, గంగరబోయిన రమేష్‌ పాల్గొన్నారు.

27నుంచి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చివ్వెంల : ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్‌ చకిలం క్రిష్ణకుమార్‌ కోరారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే బ్రహ్మోత్సవాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. వేద పండితులు శ్రీమాన్‌ అరుట్ల రవికుమార చార్యులు, అరవిందచార్యులు, క్రిష్ణమాచార్యులు ఆధ్వర్యంలో త్రయహ్నిక దీక్షతో వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బందకవి క్రిష్ణమోహన్‌, ఎలగబోయిన శ్రీరాములు, కైరోజు శంకరచారి, కంకోటి నర్సయ్య, గుండా శ్రీనివాస్‌, బొబ్బిలి శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ధోరణిలో మార్పు రావాలి



లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్‌ బీఎస్‌ లత

దురాజ్‌పల్లి : పిల్లల చదువుపై తల్లిదండ్రుల ధోరణిలో మార్పు రావాలని అదనపు కలెక్టర్‌ బీఎస్‌ లత సూచించారు. పిల్లలు ఉన్నత స్థాయి చదువుల్లో రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమని పేర్కొన్నారు. హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్‌ (రామంతపూర్‌, బేగంపేట)లో 2024–25 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థులకు రెండు సీట్లు కేటాయించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ బీఎస్‌ లత ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహించారు. మొత్తం 34మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఇద్దరు విద్యార్థులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. జిల్లాలో అరెంపుల లాస్యశ్రీ, ఇరుగు జెస్సికా లాటరీ ద్వారా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ ప్రభావంతో పిల్లలు ఆటలకు దూరం అవుతున్నారని తెలిపారు. ఆటలు లేకపోవడంతో శారీరక శ్రమ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి అధికారి కె.లత, సోషల్‌ వెల్ఫేర్‌ జిల్లా కో ఆర్డినేటర్‌ పుండారిక చారి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్‌



దురాజ్‌పల్లిలో ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌ రెడ్డి

చివ్వెంల : మత సామరస్యానికి ప్రతీక రంజాన్‌ పండుగ అని సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే, మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం దురాజ్‌పల్లిలో ముస్లింలు నిర్వహించిన ఇఫ్తార్‌ విందు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముస్లింలు రంజాన్‌ పండుగను ప్రశాంత వాతావరణంతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌ రెడ్డి, మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్‌, ధరావతు సాగర్‌ నాయక్‌, కొత్తపల్లి వెంకన్న పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతా

- ఎమ్మెల్యే మందుల సామేల్‌



మద్దిరాలలో బీటీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌

మద్దిరాల : వెనుకబడిన తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు వరుసలో నిలుపుతానని ఎమ్మెల్యే మందుల సామేల్‌ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్టీ, ఎస్‌డీఎఫ్‌ నిధులు రూ.5కోట్ల 60లక్షలతో మంజూరైన బీటీరోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 3నెలల్లోనే రూ.100కోట్లతో అనేక పథకాలను చేపట్టిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే 5గ్యారంటీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిది అని అన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చారని తెలిపారు. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు తప్పకుండా ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్‌, ఎంపీటీసీ మార్త అనిత కృష్ణమూర్తి, సచ్చిపాల వెంకన్న, బొబ్బిలి వెంకన్న, గ్రామశాఖ అధ్యక్షుడు నలమాస ఉపేందర్‌, మనోహర్‌రావు, భూతం చలం, వల్లపు అవిలయ్య, రమేష్‌, లింగయ్య, అనిల్‌, కోటి, యాకయ్య, కూజ ఎల్లేష్‌, సుల్తాన్‌ నరేష్‌, పులిగిల్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులు అరికట్టడానికి షీ టీమ్‌లు

సూర్యాపేట క్రైం : మహిళలపై వేధింపులు అరికట్టడానికి షీ టీమ్‌లు పనిచేస్తున్నాయని సూర్యాపేట జిల్లా షీ టీమ్‌ స్టేషన్‌ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. షీ టీమ్‌ల గురించి మహిళల్లో అవగాహన పెంచడానికి షీ టీమ్‌ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వేధింపులకు గురవుతున్న మహిళలు షీ టీమ్‌ సెల్‌ 8712686056 నంబర్‌కు మెసేజ్‌, వాట్సాప్‌ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో విద్యాపరంగా మెడికల్‌ కళాశాల, విద్యాసంస్థలు విరివిగా ఏర్పాటవుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో అమ్మాయిలకు రక్షణగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్‌ సిబ్బంది సురకంటి ఎల్లారెడ్డి, జాఫర్‌, శివరాం, సాయిజ్యోతి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో శుక్రవారం వంద పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మన్నెరేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్‌ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్‌. పద్మ, సిబ్బంది యాదగిరి, యాకయ్య, గ్రామస్తులు బొల్లం మల్లేష్‌, వెంకన్న, తొలుసూరు సోమయ్య, తొట్ల లింగయ్య, మల్లేష్‌, తిరుమలేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



తిరుమలగిరిలో పాలాభిషేకం చేస్తున్న యాదవ సంఘం నాయకులు



తిరుమలగిరిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మేరు సంఘం నాయకులు

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదవ, కురుమల అభివృద్ధికి యాదవ, కురుమ కార్పొరేషన్‌ ఏర్పాటు చేయడం పట్ల శుక్రవారం తిరుమలగిరిలో ఆ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసన సభ్యుడు మందుల సామేల్‌ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల శాఖ అధ్యక్షుడు చిర్రబోయిన హన్మంతు, మల్లయ్య, లింగయ్య, పరమేష్‌, కొండయ్య, లింగన్న, లింగయ్య, వెంకన్న, సోమయ్య, శ్రీనివాస్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

మేరు సంఘం ఆధ్వర్యంలో..

మేరు సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్‌ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ రామగిరి సోమేష్‌, మండల అధ్యక్షుడు నగేష్‌, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌, ఉపేందర్‌, సీతారాములు, మధు, సురేష్‌, శ్రీనివాస్‌, వెంకన్న, సోమయ్య, కృష్ణ, అశోక్‌ పాల్గొన్నారు.

దత్తాత్రేయ విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భానుపురి : పట్టణంలోని సాయినగర్‌లో గల సాయిబాబా ఆలయంలో దత్తాత్రేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గుంటూరు నుంచి వచ్చిన వేద పండితులు హోమం, వివిధ రకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు గోపి కృష్ణ మాట్లాడారు. శనివారం ఉదయం దత్తాత్రేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ సవరాల సత్యనారాయణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకుల రాస్తారోకో



అర్వపల్లిలో హైవేపై రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

సూర్యాపేట : ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం సరికాదని బీఆర్‌ఎస్‌ నాయకులు అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని జనగామ క్రాస్‌ రోడ్డులో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్‌, కిషోర్‌, లవకుశ, కవిత, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ఎమ్మెల్సీ కవిత అరెస్టును ఖండిస్తూ అర్వపల్లిలో బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని రమేష్‌గౌడ్‌, బైరబోయిన రామలింగయ్య, కడారి నరేష్‌, దుబ్బాక ఎల్లంరాజు, లోడంగి లింగరాజు పాల్గొన్నారు.

భీమిరెడ్డి నరసింహారెడ్డి జీవితం ఆదర్శనీయం



దురాజ్‌పల్లి : సూర్యాపేటలో బీఎన్‌ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



అర్వపల్లిలో బీఎన్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీరపాపయ్య, నాయకులు

దురాజ్‌పల్లి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ భీమిరెడ్డి నరసింహారెడ్డి జీవితం ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం బీఎన్‌ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం బీఎన్‌ చేసిన కృషి మరువలేనిదన్నారు. మూడుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి నీతిగా, నిజాయితీగా పని చేశారని తెలిపారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బీఎన్‌ అన్నారు. బీఎన్‌ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జిల్లపల్లి నరసింహారావు, ఎల్గూరి గోవింద్‌, కొప్పుల రజిత, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మాజీ పార్లమెంట్‌ సభ్యుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి జయంతి వేడుకలను తిరుమలగిరిలోని తెలంగాణ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం, పూలే అధ్యయన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య మాట్లాడారు. రైతాంగ సాయుధ పోరాటంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి అహర్నిషలు కృషి చేశాడని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి శ్రీరాంసాగర్‌ జలాలు రావడానికి పెద్ద ఎత్తున ఆందోళన చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, శ్రీకాంత్‌, పరమేష్‌, లింగయ్య, మధు, కొండ స్వామి, యాదగిరి పాల్గొన్నారు.

అర్వపల్లి : శ్రీరాంసాగర్‌ నీటిని సాధించిన మాజీ ఎంపీ భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరును ఎస్సారెస్పీ కాలువకు పెట్టాలని ఎంసీపీఐయూ తుంగతుర్తి డివిజన్‌ ఇన్‌చార్జ్‌ ఈదురు వీరపాపయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అర్వపల్లిలో శుక్రవారం బీఎన్‌ 101వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్‌ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, పేదప్రజల విముక్తి కోసం ఎనలేని పోరాటాలు చేసిన అలుపెరగని వీరుడు బీఎన్‌ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పుప్పాల నర్సింహ, తాడూరి నాగయ్య, మాతంగి నరేష్‌, బండెల ఆంజనేయులు, షేక్‌ యాకూబ్‌ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



తిరుమలగిరిలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఫౌండేషన్‌ సభ్యులు

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సాంబశివుడు, రాములు ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో దాత నారి పరమేష్‌ శుక్రవారం పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు చిర్రబోయిన హన్మంతు, కొత్తగట్టు మల్లయ్య, కందుకూరి సోమయ్య, రాంప్రభు, వెంకన్న, కడెం మల్లయ్య, ఉప్పలయ్య, జినుకల లింగయ్య, స్వామి, మధు, సాంబయ్య పాల్గొన్నారు.

మద్దిరాల : 10వ, తరగతి విద్యార్థులు పబ్లిక్‌ పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తహసీల్దార్‌ అమీన్‌సింగ్‌ అన్నారు. రెడ్డిగూడెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 10వ, తరగతి విద్యార్థులకు గ్రామ స్పెషల్‌ ఆఫీసర్‌, హార్టికల్చర్‌ అధికారి స్రవంతి సహకారంతో సమకూర్చిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులను శుక్రవారం ఆయన విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

నూతనకల్‌ : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని జీవితంలో స్థిరపడాలని ఎంఈఓ రాములు నాయక్‌ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి 10/10 జీపీఏ సాధించాలని ఆయన కోరారు. తంగెళ్ల చంద్రశేఖర్‌రాజు ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.10వేలు విలువ చేసే ప్యాడ్‌లు, పెన్నులను 121మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మద్దిరాల : విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న తహసీల్దార్‌ అమీన్‌సింగ్‌



నూతనకల్‌ : విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ పంపిణీ చేస్తున్న దాతలు

చట్టసభల్లో బీసీ వాటా సాధించాలి



మాట్లాడుతున్న ఓబీసీ జాక్‌ చైర్మన్‌ నరేందర్‌

నాగారం : చట్ట సభల్లో బీసీలకు రావాల్సిన వాటా వచ్చేంత వరకు పోరాటం చేయాలని ఆలిండియా ఓబీసీ జాక్‌ చైర్మన్‌ సాయిని నరేందర్‌ అన్నారు. బీసీ వాటా సాధనకోసం చేస్తున్న పాదయాత్ర శుక్రవారం నాగారం మండల కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక రంగాల్లో సమ న్యాయం జరగాలంటే బీసీలకు చట్ట సభల్లో సమాన వాటా దక్కాలని తెలిపారు. చట్ట సభల్లో బీసీల వాటా సాధనకోసం పోరాడిన వారి స్ఫూర్తితో తెలంగాణలో బీసీ పాదయాత్ర చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌, సిద్ధేశ్వర్లు, పటేల్‌ వనజ, వెలుగు వనిత, ఎర్ర శ్రీహరిగౌడ్‌, భిక్షపతిగౌడ్‌, అజయ్‌ పటేల్‌, కుమార్‌ గాట్లే, రమారెడ్డి, వెంకటస్వామి, అంజయ్య, సత్తయ్య, వెంకన్న, వెంకటయ్య, రాంమూర్తి, వెంకన్న, సురేష్‌, యాదగిరి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నష్ట పరిహారం చెల్లించాలి

అర్వపల్లి : వర్షాభావ పరిస్థితులు, గోదావరి జలాలు అందక ఎండిపోయిన పంట పొలాలకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్‌ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీజన్‌లో ఎస్సారెస్పీ రెండో దశ కింద గోదావరి జలాలు సరిగా రాక పంటలు ఎక్కడికక్కడే ఎండిపోతున్నాయని చెప్పారు. జాజిరెడ్డిగూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్దిరాల : మండల పరిధిలోని ముకుందాపురంలో ఎమ్మెల్యే మందుల సామేల్‌ సహకారంతో మంజూరైన ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధులు రూ.10లక్షలతో శుక్రవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ పనులకు కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్‌ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, మాజీ సర్పంచ్‌ ఏల్లు మహిపాల్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సోడం శ్రీనివాస్‌, రేసు విజయ్‌, పుల్లారెడ్డి, విక్రమ్‌రెడ్డి, ఉప్పలయ్య పాల్గొన్నారు.

సంఘబంధం కమిటీ ఎన్నిక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం సంఘ బంధం–1 నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కుంభం వెంకటరమణ, ఉపాధ్యక్షురాలిగా మాదగాని సురాంబ, కార్యదర్శిగా దేవరకొండ సోమనర్సమ్మ, కోశాధికారిగా నోముల స్వాతి, సంయుక్త కార్యదర్శిగా పగిడిమర్రి లక్ష్మిలను ఎన్నుకున్నారు.

మాజీ సర్పంచ్‌ మృతి

ఆత్మకూర్‌ (ఎస్‌) : కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు, తుమ్మలపెన్‌పహాడ్‌ గ్రామ మాజీ సర్పంచ్‌ బైరు అంజయ్యగౌడ్‌ (78) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహానికి పార్టీ నాయకులు నివాళులర్పించారు. కాంగ్రెస్‌ పార్టీ నాయకుడిగా, సర్పంచ్‌గా గ్రామానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఎల్లమ్మ మృతి తీరని లోటు

నూతనకల్‌ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకురాలు సంగినేని ఎల్లమ్మ (66) మృతి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతదేహానికి నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, నాగం సుధాకర్‌రెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి, మహేశ్వరం చంద్రకళవెంకటయ్య, నాగం జయసుధ, బొడ్డుపల్లి అంజయ్య, జటంగి గణేష్‌ తదితరులు ఉన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

ఆత్మకూర్‌ (ఎస్‌) : మండల పరిధిలోని కందగట్ల ఆవాస ప్రాంతమైన భజనతండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా అభినయించి ఆకట్టుకున్నారు. వీరిని ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ సైదులుగౌడ్‌ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడపర్తి శ్రీనివాస్‌నాయుడు, అంగన్‌వాడీ టీచర్‌ సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఐ సైదులుగౌడ్‌